

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 07-04-2026 | సంపుటి - 27 | సంచిక -315 | రూ : 4 | పేజీలు: 8




## అధికారం అంటే గొప్ప బాధ్యత: భట్టి

2లో


- పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నామన్న భట్టి
- అధికారం అంటే హోదా కాదన్న డిప్యూటీ సీఎం
- 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడి

# జిల్లాల హద్దుల మార్పుపై కమిషన్

- అ కేంద్ర ప్రభుత్వ గడువు ముగిశాక ఏర్పాటు
- జూన్ 2లోపు ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూమిపూజ
- డిసెంబరులో ఆడబిడ్డలకు చిలకపచ్చ రంగు చీరల పంపిణీ
- పిప్పిరి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రూ.1,239 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

2లో





2లో

### గల్ఫ్ జలాల్లో చిక్కుకున్న భారత నౌకలు

## కేంద్రం నిరంతర పర్యవేక్షణ

- పశ్చిమ ఆసియాలో భారతీయుల భద్రతకు కేంద్రం చర్యలు
- హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు
- ఇప్పటివరకు 1,599 మంది నావికులను వెనక్కి రప్పించిన ప్రభుత్వం
- ఇరాన్ నుంచి 1,777 మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- భారత్‌లోని పోర్టుల కార్యకలాపాలు సాధారణంగానే ఉన్నాయని వెల్లడి



## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

- ఇనుప గేటును ధ్వంసం చేస్తూ దూసుకెళ్లిన కారు
- కారు సీజ్..నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అసెంబ్లీ గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లాడు. అనంతరం స్పీకర్ విజయేందర్ గుప్తా కార్యాలయం బయట పుష్పగుచ్ఛం ఉంచి, కారుపై సిరా విసిరి..

తరువాయి 2లో

## ఇంకొన్ని గంటలే..!

- హర్మూజ్‌పై రేపు తెల్లవారుజామున‌తో ముగియనున్న ట్రంప్ గడువు
- యుద్ధం ఏ మలుపు తీసుకునేనో..
- ఇరాన్‌ను ఒక్కరాత్రిలో తుడిచిపెట్టేయగలమన్న అమెరికా అధ్యక్షుడు
- 45 రోజుల కాల్పుల విరమణకు ఈజిప్టు, పాక్, తుర్కియే ప్రతిపాదన
- తిరస్కరించిన ఇరాన్
- యుద్ధం శాశ్వత ముగింపునే తాము కోరుకుంటున్నట్లు వెల్లడి
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు
- 26 మంది మృత్యువాత
- మృతుల్లో ఐఆర్‌జీసీ నిఘా విభాగం అధిపతి
- సౌత్ పార్స్‌పైనా ఇజ్రాయెల్ దాడి

2లో



## అమరావతికి రాజముద్ర

- 2024 జూన్ 2 నుంచి రాష్ట్ర రాజధాని హోదా
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకంతో చట్టరూపం
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టపరమైన గుర్తింపు పొందింది. 2024 జూన్ 2 నుంచి అమరావతికి రాష్ట్ర రాజధాని హోదా దక్కింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014ను సవరిస్తూ కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిన బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఈ నెల 1, 2 తేదీల్లో ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సంతకం చేశారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ

తరువాయి 2లో

## నదుల అనుసంధానంతో.. సీమ సస్యశ్యామలం

- జలసంరక్షణకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం
- అమరావతి ఒక్కటే రాజధాని
- రాష్ట్రానికి ద్రోహం చేసినవారే 'మావిగన్' అంటున్నారు
- యాడికిలో 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో





### అమరావతికి సరికొత్త వెలుగులు



2లో

- చట్టబద్ధతతో పెట్టుబడిదారులకు భరోసా
- కేంద్రం సహకారంతో మరింత జోరుగా పనులు

# ఇంకొన్ని గంటలే..!

దుబాయ్: హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ.. పశ్చిమాసియా యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటోందనన్న తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఇచ్చిన గడువు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటలు) ముగియనుంది. అప్పట్లోగా హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను నేలమట్టం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంతకుముందు డెడ్‌లైన్ పొడిగింపులతో తాత్కాలిక ఊరటలు కల్పించిన అమెరికా అధ్యక్షుడు.. ఈసారి మాత్రం పొడిగింపు ఉండబోదని తేల్చిచెప్పారు. ఇరాన్‌ను తమ బలగాలు ఒక్కరాత్రిలో తుడిచి పెట్టేయగలవన్నారు. ఆ రాత్రి మంగళవారం రాత్రే కావొచ్చని హెచ్చరించారు. పరిస్థితులు మరింత విషమిస్తుండటంతో ఈజిప్టు, పాకిస్థాన్, తుర్కియే మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ముమ్మరం చేసినా.. ఆశించిన ఫలితం దక్కలేదు! 45 రోజుల కాల్పుల విరమణ కోసం అవి కీలక ప్రతిపాదన చేయగా.. తిరస్కరించింది. తాత్కాలిక కాల్పుల విరమణను కాకుండా, యుద్ధానికి శాశ్వత ముగింపును తాము కోరుకుంటున్నట్లు తెలిపింది. మరోవైపు ఇరాన్‌పై వైమానిక దాడులతో అమెరికా, ఇజ్రాయెల్ సోమవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐఆర్‌జీసీ నిఘా విభాగం అధిపతి మేజర్ జనరల్ మాజిద్ ఖదేమీ ఉండటం టెహ్రాన్‌కు గట్టి ఎదురుదెబ్బ. ఇరాన్‌కు ప్రధాన ఆదాయ వనరైన సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రంపైనా ఇజ్రాయెల్ దాడి చేసింది. టెహ్రాన్ కూడా ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ అరబ్‌లోని తన పొరుగు దేశాలపై దాడులు కొనసాగించింది.

**చర్చలకు సమయం దక్కేలా..**

హర్మూజ్‌పై ట్రంప్ డెడ్‌లైన్ సమీపించడంతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ, అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లకు ఈజిప్టు, పాక్, తుర్కియే తాజాగా కీలక ప్రతిపాదనను చేరవేశాయి. 45 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించడం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం అందులోని ప్రధానాంశాలు. యుద్ధం ముగింపునకు మార్గం గుర్తించేలా సమగ్ర చర్చలు జరిపేందుకు 45 రోజుల కాల్పుల విరమణ సమయం దోహదపడుతుందని అవి పేర్కొన్నాయి. మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో పాక్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, స్టీవ్ విట్కాఫ్, అబ్బాస్ అరాగ్చీలతో ఫోన్‌లో ఆదివారం రాత్రి విడివిడిగా చాలాసేపు మాట్లాడినట్లు సమాచారం.

**అంగీకరించని ఇరాన్**

మధ్యవర్తుల ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. తాత్కాలిక కాల్పుల విరమణను కాకుండా, యుద్ధానికి శాశ్వత ముగింపునే తాము కోరుకుంటున్నట్లు తెలిపింది. తమపై మళ్లీ దాడి జరగదన్న హామీ కావాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు తమ స్పందనను పాక్ ద్వారా తెలియజేసినట్లు కైరోలోని ఇరాన్ దౌత్య మిషన్ చీఫ్ మొజ్తాబా ఫెర్దౌసీ పౌర్ చెప్పారు. హర్మూజ్‌లో రాకపోకల నియంత్రణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు ఒమన్‌తో కలిసి తాము పని చేస్తున్నామని తెలిపారు.

**దద్దరిల్లిన టెహ్రాన్**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు సోమవారం బాంబుల వర్షం కురిపించాయి. నగరంలో షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీని కూడా అవి లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ ప్రాంగణం సమీపంలోని భవనాలు, సహజవాయువు పంపిణీ కేంద్రం దెబ్బతిన్నాయి. టెహ్రాన్‌కు నైరుతి దిశలోని ఎల్లామ్‌షర్‌పై జరిగిన దాడుల్లో కనీసం 15 మంది మృత్యువాతపడ్డారు. కోమ్ నగరంలో ఐదుగురు మరణించారు. ఇతర నగరాల్లో మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు వెల్లడించారు. టెహ్రాన్‌లోని బహ్రామ్, మెహ్రాబాద్, అజ్మయేష్ విమానాశ్రయాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. తమ దాడుల్లో ఇరాన్ వాయుసేనకు చెందిన డజన్లకొద్దీ హెలికాప్టర్లు, ఓ విమానం దెబ్బతిన్నాయని పేర్కొంది. టెహ్రాన్‌పై దాడుల్లో మేజర్ జనరల్ మాజిద్ ఖదేమీ మరణించినట్లు ఇరాన్ సైన్యం ధ్రువీకరించింది.

# అమరావతికి రాజముద్ర

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టపరమైన గుర్తింపు పొందింది. 2024 జూన్ 2 నుంచి అమరావతికి రాష్ట్ర రాజధాని హోదా దక్కింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014ను సవరిస్తూ కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిన బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఈ నెల 1, 2 తేదీల్లో ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సంతకం చేశారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం2026గా దానికి చట్టరూపం (నం.7/2026) ఇచ్చారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించాలని కోరుతూ ఏపీ శాసనసభ మార్చి 28న చేసి పంపిన తీర్మానం మేరకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)ని సవరించి.. 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తింపునిస్తూ సవరణ బిల్లులో చేర్చింది. దానిపై ఈనెల 1, 2 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో చర్చించి, మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేశారు. పార్లమెంటు ఆమోదించిన ఆ బిల్లును కేంద్ర న్యాయశాఖ సోమవారం రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 కింద దఖలుపడిన అధికారాలను అనుసరించి.. ఆమె వెంటనే దానిపై సంతకం చేశారు. అనంతరం అమరావతి బిల్లు చట్టరూపం సంతరించుకున్నట్లు ప్రకటిస్తూ న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# జిల్లాల హద్దుల మార్పుపై కమిషన్

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం 2027 మార్చి 31 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులు మార్చవద్దని గడువు విధించిందని, అది ముగిసిన తర్వాత జ్యుడిషియల్ కమిషన్ వేసి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎల్పీనేతగా భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా పిప్పిరి నుంచి మూడేళ్ల క్రితం ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను పురస్కరించుకొని 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు.. కానీ భేదాభిప్రాయాలు ఉండకూడదు. తెలంగాణ రాష్ట్రం అంటే రాజకీయ విలువలకు వేదిక. ఏది పడితే అది మాట్లాడితే పేదలకు అన్యాయం జరుగుతుంది. అభివృద్ధి ఆగిపోతుంది. అలా జరగకుండా ఉండాలనే మా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలకు శాసనసభ, బహిరంగసభల్లో మాట్లాడే అవకాశం దొరికేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయదు. కాంగ్రెస్‌కు ఓట్లేసినవారు, వేయనివారనే తేడా లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వం రెండు పడక గదులు ఇళ్లు ప్రకటించి ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. నిర్మాణాలను బట్టి డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.5,400 కోట్లు చెల్లించాం. పిప్పిరిలో నిర్వహించింది రాజకీయ సభ కాదు. అయినప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్‌కు మేలు చేసేలా రూ.1,239 కోట్ల వ్యయం చేసే పథకాల్లో కొన్నింటిని ప్రారంభించాం. మిగిలిన వాటికి శంకుస్థాపన చేశాం. ఎర్రబస్సు ఎరగని ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయాన్ని మంజూరు చేశాం. వీలైతే వచ్చే జూన్ 2లోపు భూమి పూజ చేస్తాం. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేశాం. భూసేకరణ పూర్తిచేశాక ప్రారంభోత్సవానికి వస్తా. నిర్మల్ జిల్లా ముథోల్‌లో మా పార్టీ ఎమ్మెల్యే లేనప్పటికీ సోమవారం ఉదయం భట్టి విక్రమార్క ఆలోచనతో వెంటనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు భూమి పూజ చేశాం. ఇది మా నిబద్ధత.

# ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అసెంబ్లీ గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లాడు. అనంతరం స్పీకర్ విజయేందర్ గుప్తా కార్యాలయం బయట పుష్పగుచ్ఛం ఉంచి, కారుపై సిరా విసిరి..అదే కారులో పరారయ్యాడు. వాహనానికి ఉత్తర్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ ప్లేటు ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. వాహనం కోసం గాలింపు చర్యలు ప్రారంభించిన ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఫోరెన్సిక్ బృందంతో పాటు బాంబు స్క్వాడ్ అసెంబ్లీలో తనిఖీలు చేపట్టాయి. పుష్పగుచ్ఛంలో ఏమీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల వేళ ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో తాజా ఘటన చోటుచేసుకోవడం భద్రతా వైఫల్యాన్ని సూచిస్తోంది. భద్రతా లోపంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నామని ఢిల్లీ అసెంబ్లీ వర్గాలు పేర్కొన్నాయి.

# అమరావతికి సరికొత్త వెలుగులు...

అమరావతి: రాజధాని అమరావతి సాకారానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జగన్ ప్రభుత్వం దెబ్బతీసిన బ్రాండ్ ఇమేజ్‌ని పునరుద్ధరించి, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పాదుకొల్పింది. అమరావతి చట్టబద్ధతతో మరింత భరోసా కల్పించింది. ఈ బిల్లు పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో పాటు గెజిట్ కూడా విడుదలైంది. కేంద్రం, రాష్ట్రంలోనూ ఒకే కూటమి అధికారంలో ఉండడంతో దిల్లీ నుంచి ఆశించిన మద్దతు అందుతోంది.

**నిర్మాణాలు శరవేగంగా**

రాజధాని ప్రాంతం నేడు జీవకళను సంతరించుకుంది. 20 వేలకు పైగా కార్మికులు అహోరాత్రులు శ్రమిస్తున్నారు. ప్రధాన రహదారులు, జలాశయాలు, కాలువల పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సివిల్ సర్వెంట్లు, గెజిటెడ్ అధికారులు, ఎన్జీవోలు, నాలుగో తరగతి ఉద్యోగుల అపార్ట్‌మెంట్ టవర్లు, న్యాయమూర్తులు, మంత్రులు, ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఐకానిక్ భవనాలుగా నిర్మిస్తున్న శాసనసభ, హైకోర్టు, సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాల టవర్లు రెండేళ్లలో సాకారం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏడంతస్తుల సీఆర్‌డీఏ భవనాన్ని, దానిపక్కనే మరో 4 భవనాలను ప్రీఫ్యాబ్రికేటెడ్ విధానంలో నిర్మించారు. సీఆర్‌డీఏ, ఏడీసీతో పాటు పురపాలక శాఖ విభాగాలన్నీ ఇక్కడి నుంచే పనిచేస్తున్నాయి. 50 ఎకరాల్లో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవనాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే నవంబర్/డిసెంబర్ నాటికి అక్కడ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటవుతుంది.

**ఒక్కో సంస్థ అడుగిడుతోందిలా..!**

వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిన అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించగలిగింది. అమరావతిని ఇక ఎవరూ ఆపలేరన్న నమ్మకాన్ని బ్యాంక్‌లు, రుణవితరణ సంస్థలు, పెట్టుబడిదారుల్లో పాదుకొల్పింది. అమరావతిలో రూ.44,600 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో పలు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. 201419 మధ్య భూములు తీసుకున్న ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థలు నిర్మాణాలు చేపడుతున్నాయి. 15 బ్యాంకుల కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఒకేరోజు శంకుస్థాపన జరిగింది. ఎస్‌ఆర్‌ఎం, విట్ యూనివర్సిటీలకు ప్రభుత్వం మరో 100 ఎకరాలు చొప్పున కేటాయించడంతో విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. బిట్స్ అమరావతి క్యాంపస్‌ని రూ.వెయ్యి కోట్లతో నిర్మిస్తోంది. ఎక్స్ఎల్ఆర్ఐ, నేషనల్ లా యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలు త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించనున్నాయి. రూ.600 కోట్లతో ఏపీ ఎన్ఆర్‌టీ భవనం నిర్మిస్తున్నారు. ఐటీ టవర్ల నిర్మాణానికి ఎల్అండ్‌టీ సంస్థకు 10 ఎకరాలు కేటాయించింది. పలు హోటళ్లు, ఆస్పత్రులు, స్కూళ్లకు ప్రభుత్వం స్థలాలిచ్చింది. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించనున్నాయి.

**నమ్మకం కుదిరి.. నిధులు సమకూరి!**

రాజధానికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా కేంద్రం మినహాయింపునిచ్చింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రెండు నెలల్లోనే రూ.15 వేల కోట్ల రుణం అందించాయి. హడ్కో రూ.11 వేల కోట్లు, నాబార్డ్ రూ.7,387 కోట్లు, నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (నాబ్‌ఫిడ్) రూ.7,500 కోట్ల రుణం అందించాయి.

# గల్ఫ్ జలాల్లో చిక్కుకున్న భారత నౌకలు.. కేంద్రం నిరంతర పర్యవేక్షణ

న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియా, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న భారతీయుల భద్రత, తరలింపు ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక వివరాలు వెల్లడించింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 16 భారత నౌకలు, 433 మంది భారత నావికులు ఉన్నారని తెలిపింది. అయితే, గత రెండు రోజుల్లో 'గ్రీన్ శాన్వి', 'గ్రీన్ ఆశా' అనే రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్టు స్పష్టం చేసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్), నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు 1,599 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించామని, వీరిలో గత 24 గంటల్లో 120 మంది ఉన్నారని తెలిపింది. మరోవైపు, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని పోర్టులలో కార్యకలాపాలు సాధారణంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం చొరవతో ఇప్పటివరకు 1,777 మంది భారతీయులను ఆ దేశం నుంచి ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లకు తరలించి, అక్కడి నుంచి స్వదేశానికి పంపే ఏర్పాట్లు చేసింది. వీరిలో 895 మంది విద్యార్థులు, 345 మంది మత్స్యకారులు ఉన్నారు. ఈ మత్స్యకారులు ఏప్రిల్ 4న ఆర్మేనియా నుంచి చెన్నైకి చేరుకున్నారు. తరలింపు ప్రక్రియకు సహకరించిన ఇరాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్ ప్రభుత్వాలకు భారత్ కృతజ్ఞతలు తెలిపింది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు 7,30,000 మంది ప్రయాణికులు భారత్‌కు తిరిగి వచ్చారు. యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్ నుంచి భారత్‌కు విమాన సర్వీసులు పరిమిత సంఖ్యలో కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వివరించింది. భారతీయుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని కేంద్రం పునరుద్ఘాటించింది.

# నదుల అనుసంధానంతో.. సీమ సస్యశ్యామలం

అనంతపురం: రానున్న గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రావిటీ ద్వారా కృష్ణా డెల్టా, విశాఖపట్నానికి నీరందిస్తామన్నారు. వైకాపా ప్రభుత్వం పోలవరంలో డయాఫ్రం వాల్‌ను కూల్చేసి ప్రాజెక్టును గోదావరిలో కలిపేసిందని, తాము 21 నెలల్లో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించామని అన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో సోమవారం జరిగిన 'నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత' అనే యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..గోదావరి నుంచి 200 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టుకు తీసుకెళ్లాలనేది నా ఆలోచన. అలా చేయడం ద్వారా శ్రీశైలంలో నీళ్లన్నీ రాయలసీమకు ఇవ్వగలిగితే ఇక్కడ కరవు అనే మాట వినపడదు. శ్రీకాకుళంలో నీరు అధికమైతే అవి అనంతపురం రావాలి. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా నదుల్ని అనుసంధానం చేస్తే ఇది సాధ్యమే. నా జీవితాశయం కూడా అదే. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు, కృష్ణా నుంచి 1,500 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళుతోంది. అందులోంచి కనీసం 200300 టీఎంసీలను రాయలసీమకు తరలించి అన్ని జలాశయాలను నింపుకోగలిగితే ఒక సంవత్సరం వర్షాలు కురవకపోయినా ఇబ్బంది ఉండదు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ ముగిసిన తర్వాత కూడా జలాశయాల్లో 65 శాతం నీరు ఉందంటే అది కూటమి ప్రభుత్వం ముందు చూపు. ఈ ఏడాది శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లాకు 74 టీఎంసీల నీటిని తీసుకొచ్చాం. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తాం.

**నీటిని నిల్వ చేస్తే సంపదే..**

భవిష్యత్తు అవసరాల కోసం డబ్బుల్ని బ్యాంకుల్లో ఎలా దాస్తామో.. నీటిని కూడా భూగర్భం, జలాశయాల్లో దాచుకోవాలి. నీటిని నిల్వ చేసుకుంటే అదే సంపద సృష్టిస్తుంది. నీటి భద్రత కోసం అన్నమయ్య జిల్లాలో జలధార ద్వారా పెద్ద ప్రయోగం చేశాం. వాగుల్ని అనుసంధానం చేసి చెరువుల్ని నింపడం ద్వారా ఒకే సంవత్సరంలో భూగర్భ జలాలు 8 మీటర్లు పెరిగాయి. జిల్లా కలెక్టర్ బాగా పనిచేశారు. 21 వేల బోర్లు, బావుల్లోకి జలం వచ్చింది. 30 నుంచి 40 శాతం విద్యుత్తు వినియోగం తగ్గింది. జిల్లాలో విద్యుత్తు వినియోగం తగ్గడం ద్వారా దాదాపు రూ.96 కోట్లు ఆదా అయ్యే పరిస్థితి వచ్చింది. ఈ ఆదాను సంక్షేమ పథకాలకు వినియోగించవచ్చు. కూటమి ప్రభుత్వం చేపట్టిన నీటి భద్రత చర్యలతో భూగర్భ జలాలు 1.92 మీటర్ల మేర పెరిగాయి. అనంతపురంలో 2.2 మీటర్లు పెరిగాయి. నీటి విలువ తెలిసిన వ్యక్తిగా దాని సంరక్షణ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్నా. తుంపర్ల సేద్యం, మైక్రో ఇరిగేషన్, నీటి గన్నులు వంటివి తీసుకొచ్చి ప్రయోగాలు చేశాం. ఎన్టీఆర్ జలసిరి, నీరుచెట్టు, నీరుమీరు, నీరుప్రగతి లాంటి కార్యక్రమాలు చేశాం. 1997లో సాగునీటి సంఘాలను తీసుకొచ్చి రైతుల్ని భాగస్వాములుగా చేశాం. ఇప్పుడు నీటి సంరక్షణ కోసం 100 రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

**ఆరేడేళ్లలో రూ.30 వేల కోట్లు ఖర్చు**

''పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. అందులోనూ రాయలసీమ నుంచే ఎక్కువ ఉత్పత్తి అవుతున్నాయి. పూర్వోదయ పథకం ద్వారా రాబోయే ఆరేడు సంవత్సరాల్లో రూ.30 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.70 వేల కోట్లు తీసుకొచ్చి రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తాం. సీమ రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్పు అందించిన ఘనత కూటమిదే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**పిచ్చిముదిరి మావిగన్ మాట**

''గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఇక మనకు ఒక్కటే రాజధాని. అది అమరావతి. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే 49 పార్టీలు అమరావతికి మద్దతిచ్చాయి. ఒక్క దిక్కుమాలిన వైకాపా మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది. ఇప్పుడు పిచ్చి ముదిరి మావిగన్ అంటూ కొత్తపేరు తీసుకొచ్చారు. అమరావతి అని పలకడం కూడా ఇష్టం లేని వ్యక్తులే మావిగన్ అంటున్నారు. రాజధాని పనులు శరవేగంగా జరుగుతుంటే చూసి సహించలేక అవినీతి జరిగిందంటూ మాట్లాడుతున్నారు. ఉత్తరాంధ్ర, అమరావతి, రాయలసీమ ప్రాంతాలను అభివృద్ధి రీజియన్లుగా తయారు చేస్తాం. ప్రతి జిల్లాను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రమే నా కుటుంబం. అందరికీ న్యాయం చేసే బాధ్యత మాదే.'' అని పేర్కొన్నారు.

# అధికారం అంటే గొప్ప బాధ్యత: మల్లు భట్టి

ఆదిలాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా పిప్రి బహిరంగ సభలో మాట్లాడుతూ, 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నామని, తమకు అధికారం అంటే హోదా కాదు, బాధ్యత అని ఆయన అన్నారు. కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లను రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ. 5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని తీసుకువచ్చామని, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వేగంగా సాగుతోందని చెప్పారు. సామాజిక అంతరాలు లేని సమాజం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని తెలిపారు. ఆదాయాన్ని సృష్టించి, ఆ సంపదను ప్రజలకే పంచడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నాడు పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నూటికి నూరు శాతం అమలు చేస్తామని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రజలకు భరోసా ఇచ్చారు.

# ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, సంబంధిత అధికారులు, మిల్లర్లు, కాంట్రాక్టర్లతో రబీ 2526 సీజన్ ధాన్యం కొనుగోళ్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్లో సుమారు 2 లక్షల 60 వేల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అందుకు తగిన విధంగా జిల్లా యంత్రాంగం అన్ని విభాగాలు డిఆర్డిఏ,



ఐకెపి, సహకార, వ్యవసాయ, రెవెన్యూ పోలీస్, మెప్మా, గిరిజన కార్పొరేషన్ అధికారులు సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో కొనుగోళ్లను నిర్వహించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేయు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, మార్కెటింగ్ డిఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ ఏడిఏ మురళి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, మెప్మా ప్రాజెక్ట్ అధికారిణి విజయ, అన్ని విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: యువత క్రీడల వైపు మొగ్గు చూపాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. సోమవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ పాతకొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన "ఎస్ అండ్ టి బూమ్ బూమ్ స్ట్రైకర్స్" బాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు ఇష్టమైన క్రీడను సాధన చేస్తే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు డి. వెంకటస్వామి, మహమ్మద్ అస్లాంను అభినందించారు. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ పదాల ఆకాంక్ష, సిపిఐ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బ్యాండ్ భవాని, గోనె సురేష్, కార్పొరేటర్లు బానోత్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెలాఖరులోగా 10 వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి,పూర్తయిన ఇండ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకుందని,జిల్లాలో మొత్తం 16 వేల 495 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్,జెడ్పీ సీఈఓ దీక్షా రైనా,పిడీ హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు,హౌసింగ్ ఏఈ లు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## కుంగ్ ఫు విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ లు ప్రదానం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ పట్టణం లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ బాలరాజ్, మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రు స్లీ ) అధ్యర్యంలో కుంగ్ ఫు విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ లు ప్రదానం చేశారు. ఇందులో కుంగ్ ఫు విద్యార్థులు తమ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బెల్టులు, సర్టిఫికెట్ లు సొంతం చేసుకున్నారు. ఇందులో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కు చెందిన ప్రేమ్ కుమార్ మరియు నిఖిత్ గౌడ్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకున్నారు. బెల్టులు, సర్టిఫికెట్ లు గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, షాద్ నగర్ పట్టణ ఎస్సై రాంచంద్రయ్య చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో ఆడపిల్లల కు రక్షణ లేదని దాని కొరకు ప్రతి ఒక్కరు కుంగ్ ఫు, కరాటే లాంటి విద్యను నేర్చుకోవాలని అన్నారు. ఆత్మరక్షనే కాకుండా దేహాదారుద్యానికి ఈ విద్య ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాస్టర్స్ బాలరాజ్, అహ్మద్ ఖాన్ (బ్రు స్లీ ),యువసత్తా లక్ష్మణ్ కుమార్,విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 11 న నల్గొండ ఐ టి టవర్స్ లో ఇన్నోవేషన్ పంచాయతీ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఈనెల 11న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్స్ లో తెలంగాణ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ పంచాయత్" ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఇన్నోవేషన్ పంచాయత్ పై రూపొందించిన గోడ పత్రికను సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎఫ్ఓ రాజశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవోలు రమణారెడ్డి శ్రీదేవి, ఈడియం దుర్గారావు,టి జి ఐ సి కో ఆర్డినేటర్లు అనూష,ఫరీన తదితరులు ఉన్నారు.

## ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కి అధికారులు తప్పక హాజరు కావాలి

*** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో పనిచేస్తున్న అన్ని విభాగాల జిల్లా అధికారులు ప్రతి సోమావారం నిర్వహించే ప్రజావాణి కి తప్పక హాజరు కావాలని లేనిచో శాఖాపరమైన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థలు), రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.అనిల్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన (195) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ మధుసూదనరాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం,డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, డి వై.ఎస్.ఓ జ్యోతి, డి.ఈ.ఓ రాజేశ్వర్, డి.డబ్ల్యూ ఓ సబిత, మెప్మా పి.డి విజయ, హౌసింగ్ అధికారి భీమ్లు, ఎస్.ఈ ఎన్. పి.డి.సి.ఎల్ విజేందర్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్, జిల్లా ఉపాధి అధికారి రజిత, పరిపాలన అధికారి పవన్ కుమార్, భూభారతి జిల్లా కో.ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రయోజనాలే పరమావధిగా భారతీయ జనతా పార్టీ ప్రస్థానం

*** బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: దేశ ప్రయోజనాలే పరమావధిగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రస్థానం సాగుతోందని బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. సోమవారం ముస్తాబాద్లో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సొల్ల క్రాంతికుమార్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొల్ల క్రాంతికుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిన బిజెపి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అంత్యోదయ సిద్ధాంతంతో పేదల సంక్షేమమే ధ్యేయంగా బిజెపి పనిచేస్తోందని, ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపి కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు కోల కృష్ణ, జిల్లెల్ల మల్లేశం, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, చిగురు వెంకన్న, పప్పుల శ్రీకాంత్, దీటి సత్యం, మీస స్వామి, ఒరగంటి సత్యం, కటకం మహేష్, పున్నం అనిల్, రంజాన్ వెంకటేష్, సర్దాని నందం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక సందర్శన

*** ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కి కావాల్సిన వసతులు ఏమి కావాలో లెటర్ రూపకంగా ఇస్తే వాటిని పరిశీలించి వెంటనే పనులు చేయిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. సోమవారం షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఉన్న డాక్టర్ స్రవంతి తో మాట్లాడుతూ ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంత ఓ.పి వస్తున్నారని, ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారని, ఎన్ని బెడ్లు ఉన్నాయని అడిగి తెలుసుకుని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇంకా ఏమైనా సేవలు అవసరము ఉన్నాయా అని కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ ల కొరతా ఉందని, స్టాఫ్ నర్స్ లు కావాలని , ప్రాథమిక ఆరోగ్య కేంద్రము మెయిన్ గేటు దగ్గర వర్షం పడినప్పుడల్లా రోడ్డుపైన ఉన్న మట్టి మొత్తము ఆరోగ్య కేంద్రంలోకి కొట్టుకొని వస్తుందని ఎమ్మెల్యేకు తెలియజేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ బయట కట్టించిన మీటింగ్ హాలు కు కాంపౌండ్ వాల్ కావాలని ఎమ్మెల్యే కు డాక్టర్ స్రవంతి తెలియజేశారు. మీ పిహెచ్సి కి కావాల్సిన వసతులు ఏమి కావాలో లెటర్ రూపకంగా ఇస్తే వాటిని పరిశీలించి వెంటనే పనులు చేయిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ స్రవంతి కి హామీ ఇచ్చారు. ఇందుకుగాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ, చంద్రకళ , ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు మరియు ఆశలు, చించోడు సర్పంచ్ శ్రీనివాస్ , డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, చెవులపల్లి సర్పంచ్ జంగయ్య , గిరిధర్, అంజయ్య, రవీందర్, ఉమామహేశ్వర్, గోపాల్ నాయక్ , రాజు , సంతోష్, జంగయ్య, రంగయ్య సూర్యప్రసాద్ , ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్లగొండ , ప్రజాస్ఫూర్తి : 2025 26 రబీ ధాన్యంసేకరణ ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లోని ఫోన్ నెంబర్ 9963407064 నెంబర్ కు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం ఆయన జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో రబీ ధాన్యం కొనుగోలుపై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వం రబీలో రైతులు పండించిన ధాన్యానికి క్వింటాలకు గ్రేడ్ "ఏ" రకానికి రూ. 2389 లు, సాధారణ రకానికి రూ.2369 ల కనీసం మద్దతు ధరను ప్రకటించిందని, ఇదే కాకుండా సన్నధాన్యానికి ప్రోత్సాహంగా క్వింటాల్ కు రూ.500ల బోనస్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దాన్యంలో ఎలాంటి తాలు,తరుగు, తేమ వంటివి లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలతో పాటు, టార్పాలిన్లు, అన్నిరకాల సదుపాయాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ధాన్యం అమ్మకంలో సమస్యలుంటే పైన పేర్కొన్న కంట్రోల్ రూమ్ కు ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని ఆయన రైతులకు సూచించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫోన్ నెంబర్లు అన్నింటిని రికార్డు రూపంలో నమోదు చేయాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే వెంటనే అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని, కంట్రోల్ రూమ్ లో 24 గంటలు విధులు నిర్వహించే విధంగా సిబ్బందికి విధులు కేటాయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ రాంపతి తదితరులు ఉన్నారు.

## ఏజెన్సీ అభివృద్ధే పోలీసుల లక్ష్యం: ఏఎస్పీ విక్రాంత్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే పోలీసుల ప్రధాన లక్ష్యమని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని కుర్నపల్లి, బత్తినపల్లి, చెన్నాపురం, చింతగుప్ప, ముల్కనపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. బట్టిగూడెం గ్రామోత్సవంలో పాల్గొన్న ఆయన, విద్య, వైద్యం, రవాణా సదుపాయాల కోసం ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ రాజువర్మ, వెంకటప్పయ్య, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో జనసేన వీర మహిళలు



కూకట్పల్లి, ప్రజాస్ఫూర్తి: సామాజిక సేవా కార్యక్రమాల్లో జనసేన వీర మహిళలు ముందుండటం అభినందనీయమని కూకట్పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బోరబండ వివేకానంద నగర్ లో జనసేన పార్టీ వీర మహిళలు ఆధ్వర్యంలో కె.దుర్గా లక్ష్మి , స్థానిక నాయకుడు పవన్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్ర శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకై మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన కె.దుర్గా లక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సుమారు వేయి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక జనసేన వీర మహిళలు వరలక్ష్మి, రజిత, సుకన్య, నారాయణమ్మ, రాధిక తో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం

*** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామ సర్పంచ్ చందు నాయక్ అధ్యర్యంలో సోమవారం ఎమ్మెల్యే చేతులమీదుగా ఉప్పరిగడ్డ గ్రామం లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా చేయడమే తన కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చందు నాయక్, గ్రామ ఉపసర్పంచ్ శ్రీలత తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ నాయక్,అయ్యావారిపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్, శ్రీను నాయక్, భీమ్లా నాయక్, విలేజ్ పార్టీ ప్రెసిడెంట్ బి. తిక్కన్న, గ్రామ మహిళా సంగమ్ అధ్యక్షురాలు రజిత,కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పశ్చిమట్ల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పశ్చిమట్ల నరేందర్ గౌడ్ 54వ జన్మదినోత్సవ పురస్కరించుకొని భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమం సంఘం కార్యాలయం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద జన్మదిన వేడుకలు భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకూరి ప్రతాపరెడ్డి, యువ నాయకులు మద్దాపురం శ్రీకాంత్ గౌడ్ లు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాల కళాశాల బస్సులపై డ్రంక్ డ్రైవ్ తనిఖీలు




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాల, కళాశాల బస్సు డ్రైవర్లపై ప్రత్యేక డ్రంక్, డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రతను ప్రధాన లక్ష్యంగా తీసుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో సమన్వయం చేసుకుని బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హతలు, వాహనాల భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా డ్రైవర్లకు బ్రెత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులకు సంబంధించిన అవసరమైన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, ఇన్సూరెన్స్, పర్మిట్ తదితర అంశాలను కూడా అధికారులు పరిశీలించారు. విద్యార్థులు ప్రయాణించే బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్‌మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాణ భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేశారు.మద్యం సేవించి వాహనం నడపడం ఒక తీవ్రమైన నేరమని, ముఖ్యంగా పాఠశాల, కళాశాల బస్సుల డ్రైవర్లు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అన్ని విద్యాసంస్థలు తమ బస్సుల నిర్వహణ, డ్రైవర్ల ప్రవర్తన, భద్రతా ప్రమాణాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే వాహనాల పరిస్థితిపై అవగాహన ఉండాలని సూచించారు.విద్యార్థుల భద్రతను కాపాడడంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## మున్సిపల్ కార్మికులకు వేసవిలో ఒక్క పూట పని విధానం అమలు చెయ్యాలి

*** సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మున్సిపల్ కార్మికులకు వేసవిలో పెరిగిన ఎండల దృష్ట్యా పని సమయాలలో వెసులుబాటు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కి మున్సిపల్ కార్మికులతో కలిసి అందజేసిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న మెమొరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పని విధానం లో పెరిగిన ఎండల రీత్యా సమయం మార్పు చేసి వారికి కొంత విశ్రాంతి ఇవ్వాలని ఆయన కోరారు.

## అన్ని శాఖల ఇంజనీరింగ్ పనులపై సమీక్ష – వేగవంతం చేయాలి

**: కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇకపై జాప్యం సహించబోమని హెచ్చరించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో అంగన్వాడీ మరుగుదొడ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మిషన్ భగీరథలో పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకుల పురోగతిపై నివేదికలు ఇవ్వాలన్నారు. రోడ్లు అండ్ భవనాలు, పబ్లిక్ హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్, విద్యుత్ శాఖల పనుల్లో సమన్వయం పెంచాలని సూచించారు. అటవీ అనుమతులు, భూ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఇరిగేషన్ శాఖలో సీతమ్మ సాగర్, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టుల పనులను గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో ఇరిగేషన్ ఈఈ అర్జున్ రావు, పీఆర్ ఈఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ నాగేశ్వరరావు, విద్యుత్ ఎస్ఈ మహేందర్, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నలిని, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ నగర్ లో ప్రజల సమస్యలను పరిష్కరించాలని డీసీ కి వినతి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చింతల సర్కిల్ ఉప కమిషనర్ లావణ్య ను బీఆర్ఎస్ నాయకులు జల్దా లక్ష్మీనాథ్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ లోని రోడ్డు నెంబర్ 6,8,10 లో నూతన సీసీ రోడ్ల నిర్మాణం , గాంధీ నగర్ ముస్లిం శ్మశాన వాటిక లో బోర్ మరమ్మతు, హిందూ శ్మశాన వాటిక లో స్నానాలగది, నూతన బోర్ , ముఖ ద్వారం నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తిమ్మయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ చెల్లింపుల వివరాల సేకరణకు కసరత్తు

- **చట్టం తెచ్చే విషయమై అధ్యయనానికి సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ**
- **వినోద పన్ను వేసేందుకు స్థానిక సంస్థలకు అవకాశం కల్పించడంపై పరిశీలన**
- **నివేదికకు 60 రోజుల గడువు**
- **రియల్ టైం డేటా మార్పిడికి 'రెవ్ వన్' పోర్టల్ ఏర్పాటు**
- **పన్ను ఎగవేతను అడ్డుకొనేందుకు ప్రభుత్వ ప్రయత్నం**




హైదరాబాద్: ప్రజలు డిజిటల్ విధానంలో చేసే చెల్లింపుల వివరాల సేకరణకు సంబంధించి చట్టం తెచ్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనానికి రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసింది. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన డేటా సేకరించి.. సమాచారాన్ని కొంతకాలం నిల్వ(స్టోర్) చేసుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ అధ్యయనం చేయాలని ఆదేశించింది. 30 రోజుల్లో ప్రాథమిక.. 60 రోజుల్లో తుది నివేదికను సమర్పించాలని పేర్కొంది. ప్రజలు ఏదైనా దుకాణాలు, వ్యాపార సంస్థలకు వెళ్లినప్పుడు పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రంపై డెబిట్ /క్రెడిట్ కార్డు ద్వారా.. లేదా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం లేదా ఫోన్‌పే, గూగుల్ పే తదితర విధానాల్లో చెల్లింపులు విరివిగా చేస్తుంటారు. ఈ వివరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వానికి అందితే వ్యాపార సంస్థల వాస్తవ ఆదాయం... వార్షిక టర్నోవర్ ఎంత? అవి చెల్లించిన జీఎస్టీ లేదా వ్యాట్ ఎంత అనేది పోల్చి చూడటానికి అవకాశం ఉంటుంది. ఇలా రియల్ టైం డేటా అంతా ఎప్పటికప్పుడు సేకరించేందుకు 'రెవ్(రెవెన్యూ) వన్' పోర్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. డిజిటల్ క్రయవిక్రయాల డేటా అంతా ఈ పోర్టల్‌లోకి వస్తే పన్ను వసూళ్లను సమీక్షించి ఎగవేతలను అడ్డుకోవచ్చని ప్రభుత్వ అంచనా. వివిధ రకాల ప్రభుత్వ విభాగాలకు అందే వినియోగదారుల చెల్లింపుల వివరాలు కూడా 'రెవ్ వన్' పోర్టల్‌లోకి వస్తే వాటిని పోల్చి చూడటం ద్వారా పన్ను వసూళ్లు పెంచాలనేది లక్ష్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో ఆదాయపు పన్ను విభాగం.. బ్యాంకుల్లో లావాదేవీలను ఆన్‌లైన్‌లో పోల్చడం ద్వారా జీఎస్టీ ఎగవేసే వారిని గుర్తిస్తోంది.

## మోటర్ ట్రాన్స్పోర్ట్ గైడ్లైన్స్ యాక్ట్ నిబంధనలు అమలు చేయాలి

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : మోటర్ ట్రాన్స్పోర్ట్ గైడ్లైన్స్ యాక్ట్ నిబంధనలు అమలు చేయాలని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. పోర్టర్ డ్రైవర్స్ పార్ట్నర్. ఓనర్స్& డ్రైవర్స్ సమ్మెకు మద్దతుగా జీడిమెట్ల డిపో దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తో పాటు పోర్టర్ డ్రైవర్ , ఓనర్స్ యూనియన్ నాయకులు ఎండి, సాజిద్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 30 వేలమంది పోర్టర్ & పార్ట్నర్ డ్రైవర్స్ సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు పోర్టర్ కమిటీ ఆధ్వర్యంలో కిరాయి రేట్లు పెంచాలన్నారు. పోర్టర్ ఆన్లైన్ యాప్. కమిషన్ 5% నుండి 9% వరకు తీసుకోవాలని కోరుతూ 16 డిమాండ్లతో పోర్టర్ ఆన్లైన్ యాప్ మేనేజ్మెంట్ కు మార్చి 5వ తారీఖున నోటీసు ఇచ్చిన ఈరోజు వరకు సమస్యల పరిష్కారం చూపడంలో పోర్టల్ మేనేజ్మెంట్ పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పోర్టల్ యాజమాన్యంతో మాట్లాడి 30 వేల మంది పోస్టర్ పార్ట్నర్ యాప్ డ్రైవర్ ల సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో పసుల అంజయ్య తిమ్మప్ప వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం

*** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని భీమారం, ఉప్పరిగడ్డ, చించొడ్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సుమారు కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక పనులను ప్రారంభించారు. . భీమారం, ఉప్పరిగడ్డ, గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా చించొడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు చించొడ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఫరక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, అయ్యవారిపల్లి గోపాల్ నాయక్, చించోడు సర్పంచ్ శ్రీనివాస్, చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, ఉప్పరిగడ్డ డిప్యూటీ సర్పంచ్ శ్రీలత తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ గజేంద్ర నాయక్, బి తిరుపతయ్య, భోజ్య నాయక్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు మార్గం

*** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు, కేసముద్రం మండలంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహిళా మండల సమాఖ్య సమావేశంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజ్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లకు ఉచిత న్యాయ సహాయం , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుంచే సేవలపై అవగాహన కల్పించారు. సమాజంలోని బలహీన వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు , వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల పరిమితి లోపు ఉన్న వారందరికీ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో చిక్కుకున్న నిరుపేదలకు కోర్టు ఖర్చులు లేకుండా,లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ అనే వ్యవస్థ ద్వారా ఉచితంగా వాదించే న్యాయవాదులను ఏర్పాటు చేసే సౌకర్యం కల్పిస్తోందని వివరించారు.గృహ హింస నిరోధక చట్టం,వరకట్న నిషేధ చట్టం మరియు ఆస్తి హక్కుల గురించి మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.గ్రామ స్థాయిలోని ప్రతి మహిళకు చట్టం పట్ల అవగాహన ఉండాలని, ఆపదలో ఉన్నప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లు తమ గ్రామాల్లోని మహిళలకు ఈ సేవల గురించి వివరించి, బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతినిధులు టి. కృష్ణ మూర్తి , మండల సమాఖ్య నాయకురాళ్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి



హైదరాబాద్: రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని, నేల ఆరోగ్యంగా ఉంటేనే పౌష్టికాహారం అందుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్)ల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో భూసార ఆరోగ్య వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ''పిల్లిపెసర, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాల ద్వారా నేల సారాన్ని పెంచాలి. పంట అవశేషాలు తగలబెట్టకుండా వాటిని ఎరువులుగా ఉపయోగించాలి.నేల ఆరోగ్య పరిరక్షణను ఉద్యమంలా నిర్వహించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నాం. వారు రైతులకు నేల యాజమాన్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే నైపుణ్యాలను వృద్ధి చేస్తారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుంచి 9 వరకు నిర్వహించే రైతు ఉత్సవాల్లో రైతులు పెద్దఎత్తున పాల్గొనేలా చూడాలి'' అని మంత్రి సూచించారు. అంతకుముందు మంత్రి ఇక్రిశాట్‌లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ (డీజీ) హిమాన్షు పాఠక్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉద్యాన శాఖ సంచాలకురాలు యాస్మిన్ బాషా, అగ్రివర్సిటీ వీసీ రాజిరెడ్డి, అగ్రివర్సిటీ పరిశోధన సంచాలకుడు బలరాం తదితరులు పాల్గొన్నారు.

## మత్తు సమస్యను సమష్టిగా ఎదుర్కోవాలి: గవర్నర్



చర్లపల్లి: సమాజంలో మత్తుపదార్థాల వాడకం తీవ్రమవుతున్న తరుణంలో ఈ సమస్యను సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. సోమవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్ర, మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌తో కలిసి 'నివృత్తి' డీఅడిక్షన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో అనేకసార్లు జైలుకు వెళ్లానని, ఖైదీలు, సిబ్బంది సమస్యలు తనకు తెలుసని పేర్కొన్నారు. సౌమ్యమిశ్ర మాట్లాడుతూ.. డీఅడిక్షన్ సెంటర్.. జైళ్లశాఖ సంస్కరణల్లో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ, ఉప్పల్ డీసీపీ సురేశ్‌కుమార్, జైళ్లశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎన్. మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో రానున్నది భాజపా సర్కారే




చార్మినార్: పశ్చిమ బెంగాల్‌లో రానున్నది భాజపా సర్కారేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. బంగ్లా చొరబాటుదారుల ఓట్లతో గెలిచేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతాబెనర్జీ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దేశభక్తులకు, దేశద్రోహులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో బెంగాలీ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా నిలిచేంద]ుకు సంసిద్ధులయ్యారని కేంద్రమంత్రి చెప్పారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ పాతబస్తీలోని బెంగాలీ కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ బెంగాల్‌లో ఉండలేక చాలామంది హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారన్నారు. ఇక్కడి పాతబస్తీలోనూ బెంగాలీ కుటుంబాలు ఉండలేని విధంగా పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. 2014కంటే ముందే యూపీఏ పాలనలో బంగ్లాదేశ్, ఇతర దేశాల నుంచి అక్రమంగా వేల మంది హైదరాబాద్‌కు వచ్చారన్నారు. రోహింగ్యాల రాకను కట్టడి చేయకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్, భారాస పాలకులు రేషన్, ఓటరు కార్డులిచ్చారని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో విందులు చేసుకునే డ్రగ్స్ రాకెట్ సమాచారం అందగానే దాడులు చేసే ప్రభుత్వం ఇక్కడి పాతబస్తీలోని అమ్మాయిల జీవితాలతో చెలగాటమాడే డ్రగ్స్ రాకెట్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. రెండ్రోజుల క్రితం పాతబస్తీలోని ముర్గీచౌక్‌లో అక్రమ డబ్బాలు తొలగించిన మున్సిపల్, పోలీసు సిబ్బందిపై మజ్లిస్ ఎమ్మెల్సీతో పాటు నేతలు తిరగబడినా ఎలాంటి చర్యలు తీసుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. పాతబస్తీలో అధికారులు, పోలీసులపై జరుగుతున్న దాడులపై సీఎం స్పందించాలన్నారు. కార్యక్రమంలో చార్మినార్ అగర్వాల్ సమాజ్, బెంగాలీ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు భాజపా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సహకారంతోనే రాష్ట్రంలో అభివృద్ధి

*** భాజపా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రామచందర్‌రావు**

హైదరాబాద్: రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం ఏమిచ్చిందని భారాస, కాంగ్రెస్‌లు పదేపదే ప్రశ్నిస్తుంటాయని, కేంద్ర సహకారం లేనిదే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం కాదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో వచ్చేది భాజపా డబుల్ ఇంజిన్ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం భాజపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు తదితరులతో కలిసి రామచందర్‌రావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ''రాష్ట్రంలో భాజపాకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. సభ్యత్వం 40 లక్షలకు చేరింది. ప్రజలు భారాస, కాంగ్రెస్‌ల పాలన చూసి విసిగిపోయారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో 2,200 కిలోమీటర్ల జాతీయ రహదారులు రాగా మోదీ పగ్గాలు చేపట్టాక 2,800 కిలోమీటర్ల మేర వచ్చాయి. హైదరాబాద్ చుట్టూ అనేక పరిశ్రమలు, విద్యా సంస్థలను కేంద్రం ఏర్పాటుచేసింది. అసలు రాష్ట్రంలో కేంద్ర సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలి'' అని అన్నారు. ''పార్టీలో నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేది లేదని'' హెచ్చరించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు మాట్లాడుతూ..దేశం ఇంకా పటిష్ఠం కావడానికి మోదీ నాయకత్వం ఎంతో అవసరమన్నారు.

# ప్రజల సంక్షేమం తప్ప.. వ్యక్తిగత ప్రయోజనాలు లేవు: భట్టి విక్రమార్క

ఆదిలాబాద్: అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. "పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు.



ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## పన్ను ఎగవేతను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్: పన్నుల ఎగవేతను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సీఎస్ నేతృత్వంలో రెవెన్యూశాఖ విభాగాల కార్యదర్శులతో అధ్యయన కమిటీని నియమించింది. ఆదాయం తెచ్చే శాఖలన్నింటినీ కలిపి 'రెవన్' పోర్టల్ అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. శాఖల మధ్య డేటా మార్పిడి, పర్యవేక్షణకు పోర్టల్ రూపకల్పనపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. స్థానిక సంస్థలు వినోదపు పన్ను వసూలు, యూపీఐ, పీవోఎస్ లావాదేవీలపై నిఘా పెట్టేలా కొత్త చట్టం ఏర్పాటు తదితర అంశాలపై అధ్యయనం చేయనుంది. 30




రోజుల్లో ప్రాథమిక, 60 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వనుంది.

## పండ్ల మార్కెట్ భూముల మీద రేవంత్‌రెడ్డి కన్ను: హరీశ్‌రావు

హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని కోహెడ పండ్ల మార్కెట్ భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను పడిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. ఎక్కడ భూములున్నా వాటిని అమ్మేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా కోహెడ పండ్ల మార్కెట్ స్థలాన్ని హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల కోసమే పని చేయాలని.. దళారుల కోసం కాదన్నారు. గతంలో మార్కెట్‌కు భూసేకరణలో భాగంగా రూ.10 కోట్లు రైతులకు ఇప్పించామని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ కట్టాలనుకున్నామన్నారు. రూ.వెయ్యి కోట్లతో డీపీఆర్ తయారు చేశామని, 100 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌కు రూపకల్పన చేశామని చెప్పారు.



## బాసర క్షేత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి..
# ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం దర్శించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది.



# పాతబస్తీలో ఒక రూల్..
## ఇతర ప్రాంతాల్లో మరొకటా?: బండి సంజయ్

హైదరాబాద్: పశ్చిమ బెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ పాలన వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. చొరబాటుదార్ల ఓట్లతో గెలవాలని ఆమె కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బెంగాలీలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో భాజపాకు ఓటు వేయాలని కోరారు. "బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మమత రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. పాతబస్తీలోనూ బెంగాలీ



కుటుంబాలు ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వేలాది మంది హైదరాబాద్ వచ్చారు. రోహింగ్యాలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చి రెడ్ కార్పెట్ పరిచారు. పాతబస్తీలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులపై మజ్లిస్ ఎమ్మెల్సీ, నాయకులు అడ్డుకొని దౌర్జన్యం చేసినా చర్యలు తీసుకోలేదు. ఆ పార్టీతో సీఎం రేవంత్‌రెడ్డి అంటకాగుతున్నారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూలుస్తుంటే.. అడ్డుకున్న భాజపా కార్యకర్తలపై, పేదలపై లాఠీ ఛార్జ్ చేసి కేసులు పెట్టారు. పాతబస్తీలో మాత్రం అక్రమ నిర్మాణాలు కూలుస్తున్న అధికారులపై దాడులు చేస్తున్నా కనీసం ఒక్క కేసు కూడా లేదు. పాతబస్తీలో ఒక రూల్.. ఇతర ప్రాంతాల్లో మరో రూల్ అమలు చేస్తారా? పాతబస్తీలో అధికారులు, పోలీసులపై జరుగుతున్న దాడులపై సీఎం వెంటనే స్పందించాలి. లేనిపక్షంలో పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదముంది" అని బండి సంజయ్ అన్నారు.

## ఇదీ మా అభివృద్ధి.. పినరయి విమర్శలపై సీఎం రేవంత్ సుదీర్ఘ లేఖ

హైదరాబాద్: కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన విమర్శలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు ఉన్న సారూప్యతను బేరీజు వేసి సుదీర్ఘమైన వివరణ ఇస్తూ ఆయనకు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి, అక్షరాస్యత, తదితర అంశాలను పూర్తి గణాంకాలతో వివరించారు. "సీఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది. ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను. రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నా బాధ్యత. మీరు చేసిన విమర్శలకు పూర్తి గణాంకాలతో సమాధానం ఇస్తున్నాను. 2024-25 ఆర్థిక ఏడాదిలో తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి 10.1 శాతంగా ఉంది. ఇది జాతీయ జీడీపీ 9.9 శాతం కంటే ఎక్కువ. మా జీఎస్‌డీపీ 16.12



లక్షల కోట్లు దాటింది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ రెండో ర్యాంకులో ఉంది. మా జియోగ్రాఫికల్ ఏరియా దేశంలో 3.5 శాతం. జనాభా తీసుకుంటే 3 శాతం కంటే తక్కువ. కానీ, జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా దాదాపు 5 శాతంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20,617 కోట్ల మేర రైతు రుణాలను మాఫీ చేశాం. 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. వ్యవసాయ రాబడులను పెంచేందుకు రైతు భరోసా కింద.. పంటల సాగుబడికి ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ పెట్టుబడి కింద ఇప్పటి వరకు 69.70 లక్షల మంది రైతులకు రూ.25,279 కోట్లు ఇచ్చాం. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం 29.40 లక్షల మంది రైతులకు.. రూ.26,098 కోట్లు ఖర్చు చేశాం. 14.91లక్షల మంది రైతులకు రూ.5లక్షలు బీమా కోసం రూ.3,124 కోట్లు ఖర్చు చేశాం. క్రాప్ బోనస్ కింద 14.91 లక్షల మంది రైతులకు రూ.3,139 కోట్లు ఇచ్చాం" అని అన్నారు.



## గజ్వేల్‌లో కొనసాగుతున్న బంద్

గజ్వేల్: గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో దుకాణాలు మూతపడ్డాయి. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో ముందు బైఠాయించి ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. గజ్వేల్‌లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## ఫుడ్‌సేఫ్టీపై వాకథాన్.. ప్రారంభించిన మంత్రి రాజనరసింహ

హైదరాబాద్: శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేటి నుంచి ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.






## బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తులు..
# గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు

హైదరాబాద్: ఓ వ్యక్తికి అత్యవసరంగా అమర్చేందుకు వైద్యబృందం బెంగళూరు నుంచి సికింద్రాబాద్‌కు ఊపిరితిత్తులు తీసుకొస్తున్నారు. బెంగళూరు నుంచి ఎయిర్‌లిఫ్ట్ చేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించనున్నారు. దీని కోసం హైదరాబాద్ సిటీపోలీసులు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, సకాలంలో అంబులెన్స్ చేరుకునేలా సహకరించాలని పోలీసులు కోరారు.

## బంజారా నేతలతో కల్వకుంట్ల కవిత భేటీ..
# తన పార్టీకి అండగా ఉండాలని విన్నపం

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపుతూ, ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అన్ని వర్గాల మద్దతు కూడగట్టే పనిలో భాగంగా, ఈరోజు ఆమె హైదరాబాద్‌లో బంజారా సామాజిక వర్గ ప్రముఖులతో




భేటీ అయ్యారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత... ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తన కొత్త రాజకీయ ప్రయాణానికి మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆమె వారిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మంత్రివర్గంలో బంజారాలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయమని ఆమె పేర్కొన్నారు. తమ పార్టీలో బంజారాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు కోరుతున్నామని కవిత అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనుకునే బంజారా యువతను, నేతలను తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కవిత పిలుపునిచ్చారు.

# జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతిపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

దిల్లీ: భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌరస్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. ''మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం.



జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం'' అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని రద్దు చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.



## 'సర్' రికార్డులను పునఃపరిశీలించండి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఏప్రిల్ 06 : పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునళ్లను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీం ఆదేశించింది. ట్రైబ్యునళ్ల పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పిలేట్ ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది.

## మదురై కోర్టు సంచలన తీర్పు.. 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

మదురై, ఏప్రిల్ 06 : తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది.

**కేసు ఏమిటంటే?**

కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సాతాన్‌కుళం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు



ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

## కాంగ్రెస్, స్టాలిన్‌తో భాజపా రహస్య ఒప్పందం: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి కాంగ్రెస్‌తో, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో 'రహస్య ఒప్పందం' ఉందని ఆరోపించారు. అందుకే ఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్ నుంచి పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తమిళనాడుకు పోలింగ్ అబ్జర్వర్లుగా పంపించారని అన్నారు. తద్వారా బెంగాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ మేరకు నడియా జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతుంటే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే బెంగాల్ నుంచి మాత్రమే సుమారు



500 మంది అధికారులను బదిలీ చేశారని మమత విమర్శించారు. భాజపా తన సొంత అధికారులను బెంగాల్‌లో కీలక పదవుల్లో పెట్టి, తమకు అనుకూలంగా పని చేయించుకుంటోందని ఆరోపించారు. ఒకవేళ బెంగాల్‌లో భాజపా అధికారంలోకి వస్తే.. చేపలు, మాంసం, గుడ్లు తినడంపై నిషేధం విధిస్తారని ఆరోపించారు. సమగ్ర ఓటర్ల సవరణ వల్ల బెంగాల్‌లో 250 మంది చనిపోయారని, దానికి భాజపా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల తర్వాత దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యతకు కృషి చేస్తానని చెప్పారు.

**మోదీ మౌనమేల?**

కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి పిచ్చి ప్రేలాపనలు చేస్తుంటే.. ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని మమతా బెనర్జీ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ర్యాలీల్లో ఎక్కడా దానిపై ఒక్క మాట కూడా ప్రస్తావించలేదన్నారు. కాబట్టి ప్రధాని పదవికి మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి గానీ, బెంగాల్‌కు గానీ ఏదైనా జరిగితే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

## ధరల పెరుగుదల భారత్‌లో కాదు.. పాకిస్థాన్‌లో: రాహుల్‌కు అమిత్ షా కౌంటర్


పుదుచ్చేరి: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తోన్న ఆరోపణలను కేంద్ర మంత్రి అమిత్ షా గట్టి కౌంటర్ ఇచ్చారు. ధరలు పెరిగిన విషయం వాస్తవమేనని, కానీ అది భారత్‌లో కాదు పాకిస్థాన్‌లో అని గుర్తుచేశారు. ఈ విషయాన్ని రాహుల్ గమనించాలంటూ కౌంటర్ ఇచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''పశ్చిమాసియా



సంక్షోభం కారణంగా ప్రపంచమంతటా ఇంధన కొరత ఏర్పడింది. ధరలు ఆకాశాన్నంటాయి. కొన్ని దేశాలు వర్క్ ఫ్రం హోమ్‌కు ఆదేశాలిచ్చాయి. వీటన్నింటినీ భారత్ అధిగమించింది. యుద్ధ పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది. పెట్రోలియం ఉత్పత్తులను ప్రజలందరికీ అందుబాటులోనే ఉంచింది. ధరలను స్థిరంగానే కొనసాగించింది. రాహుల్ చెబుతున్నది వాస్తవమే. పెట్రోల్ ధరలు రూ.458కి పెరిగాయి. డీజిల్ ధరలు రూ.520కి చేరాయి. కానీ ధరలను పెంచింది ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్ అని ఆయన గుర్తించాలి'' అని షా చమత్కరించారు. అలాగే, రాష్ట్రంలో తమ కూటమి భారీ మెజారిటీతో గెలిస్తే పుదుచ్చేరి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## దిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: దిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం తలెత్తింది. శాసనసభ ప్రాంగణంలోకి చొరబడడానికి కారులో ప్రయాణిస్తున్న దుండగులు యత్నించారు. కారు బలంగా అసెంబ్లీ గేటును ఢీకొట్టడంతో గేటు విరిగిపడింది. దీంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఓ కారు వేగంగా అసెంబ్లీ వద్దకు దూసుకువచ్చింది. గేటును బలంగా ఢీకొట్టుకుంటూ లోపలికి వెళ్లింది. అనంతరం మాస్క్ వేసుకున్న ఓ వ్యక్తి కారు దిగి అసెంబ్లీ స్పీకర్ కార్యాలయం వైపు వెళ్లాడు. తనతో పాటు తీసుకువచ్చిన పూల బొకేను కార్యాలయం ముందు ఉంచి తిరిగి కారులో పరారయ్యాడు. బయటకు వెళ్లే సమయంలో దుండగుడు స్పీకర్ కారుపై ఇంక్ చల్లినట్లు అధికారులు తెలిపారు. సీసీకెమెరా దృశ్యాల ఆధారంగా దిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో అసెంబ్లీకి



ఉన్న అన్ని ప్రవేశ మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పర్యవేక్షణను, తనిఖీలను మరింత కఠినతరం చేస్తున్నామన్నారు. అధికారులు ప్రవేశించే మార్గాల్లో అత్యవసర ప్రొటోకాల్ నిబంధనలు అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



## సీఈసీపై విపక్షాల అభిశంసన నోటీసు తిరస్కరణ

దిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై విపక్షాలు ఇచ్చిన అభిశంసన తీర్మానం తిరస్కరణకు గురైంది. ఈ తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు గత నెలలో అందజేసిన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ తిరస్కరించారు. ఈ విషయాన్ని రాజ్యసభ సచివాలయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. అలాగే, అటు లోక్‌సభలోనూ ఈ నోటీసు తిరస్కరణకు గురైంది. సీఈసీని విధుల నుంచి తొలగించాలంటూ విపక్షాలు ఇచ్చిన అభిశంసన నోటీసును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం తిరస్కరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ భాజపాకు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై విపక్షాలు మొత్తం ఏడు అభియోగాలను మోపాయి. అందువల్ల ఆయన్ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఇండియా కూటమి పక్షాలు ఉభయ సభల్లోనూ నోటీసులు సమర్పించాయి. 130 మంది సభ్యుల సంతకాలతో లోక్‌సభలో, 63మంది ఎంపీల సంతకాలతో రాజ్యసభలో గత నెలలో నోటీసులు అందజేయగా.. తాజాగా ఈ తీర్మానాలను తిరస్కరిస్తూ రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

## లియాండర్ పేస్‌కు ఎక్స్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 : టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ కు ఎక్స్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. త్వరలో ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది. బెంగాల్‌లో ఎన్నికలకు ముందు ఇటీవల ఆయన భాజపాలో చేరిన విషయం తెలిసిందే. బెంగాల్ సహా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కార్యకలాపాలు కొనసాగుతున్న వేళ ఆయన భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇందులోభాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. భాజపాలో చేరిన వారం రోజుల్లోనే కేంద్రం ఆయనకు ఎక్స్ కేటగిరీ భద్రత కల్పించడం గమనార్హం. కోల్‌కతాలో పుట్టిన లియాండర్ పేస్.. దిగ్గజ టెన్నిస్ క్రీడాకారుడిగా గుర్తింపు సంపాదించారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచారు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8



పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికలకు ముందు ఇటీవల భాజపాలో చేరారు. బెంగాల్‌కు రెండు దఫాలుగా ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

## అమెరికా ప్రతిపాదనలకు ఇరాన్ 'నో'!

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో అమెరికా చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. ఈ మేరకు పాకిస్థాన్ ద్వారా తన స్పందనను తెలియజేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. తాము తాత్కాలిక సంధికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పిన ఇరాన్.. ఈ యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. మరోవైపు, ఇరాన్ ఈ సందర్భంగా 10 డిమాండ్లను అమెరికా ముందు ఉంచినట్లు సమాచారం. ఘర్షణలకు ముగింపు పలకాలని, హర్మూజ్ జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణానికి నియమావళి రూపొందించడంతో పాటు ఆంక్షలను ఎత్తివేయడం, పునర్నిర్మాణానికి సంబంధించి పలు నిబంధనలు ఇందులో ఉన్నాయి. 'మేం కేవలం కాల్పుల విరమణను మాత్రమే అంగీకరించం' అని కైరోలోని ఇరాన్ దౌత్యమిషన్ అధిపతి మొజ్తబా ఫెర్దౌసీ 'ది అసోసియేటెడ్ ప్రెస్'తో అన్నట్లు సమాచారం. తమపై మళ్లీ దాడి జరగదనే హామీలతో కూడిన యుద్ధం ముగింపునకు మాత్రమే అంగీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై బాంబుదాడులు జరిపేందుకు ట్రంప్ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ తరహా స్పందన రావడం గమనార్హం.

# ఇరాన్-అమెరికా శాంతి చర్చలు... దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ లాభాలతో కళకళలాడాయి. శాంతి చర్చలతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న సానుకూల అంచనాలు ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఈ సానుకూల పరిణామాలతో అన్ని రంగాల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 787 పాయింట్లు లాభపడి 74,106.85 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 255 పాయింట్లు వృద్ధి చెంది 22,968.25 వద్ద ముగిసింది.

అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలకు ముగింపు పలికేందుకు ఒక ప్రతిపాదన సిద్ధమైనట్లు వచ్చిన నివేదికలు మార్కెట్లకు ప్రధాన ఊతమిచ్చాయి. రెండు దశల్లో ఈ ఒప్పందం కుదరనుండగా, 15 నుంచి 120 రోజుల్లో తుది కాల్పుల విరమణ ఒప్పందంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అణు కార్యక్రమాలపై పరిమితులు, ఆంక్షల ఉపశమనం వంటి అంశాలు ఈ ప్రతిపాదనలో ఉన్నట్లు సమాచారం. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే ప్రపంచ మార్కెట్లు స్థిరపడతాయని, ముఖ్యంగా ఇంధన ధరలు అదుపులోకి వస్తాయని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీ కీలకమైన 23,000 స్థాయికి చేరువలో ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ స్థాయిని అధిగమించి స్థిరపడితే, 23,200 వరకు వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 22,800 - 22,750 జోన్ తక్షణ మద్దతుగా పనిచేస్తుందని, 22,550 వద్ద బలమైన మద్దతు ఉందని నిపుణులు విశ్లేషించారు.

నిఫ్టీలో ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, టైటాన్ కంపెనీ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 1.52 శాతం, స్మాల్‌క్యాప్ 1.29 శాతం మేర లాభపడ్డాయి. అయితే, ముడి చమురు ధరల్లో అస్థిరత కారణంగా ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం కొంత వెనుకబడింది.

## క్రూడాయిల్ ధరలను భారీగా పెంచిన సౌదీ అరేబియా



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో, చమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి. తాజాగా సౌదీ అరేబియా క్రూడాయిల్ ధరలను పెంచింది. మే నెలకు గాను బెంచ్ మార్క్ ధర కంటే 19.50 డాలర్ల అధిక ధరకు ఆసియా రిఫైనరీలకు విక్రయిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీనితో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు 50 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి.

పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న సౌదీ అరేబియా, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు కొనసాగే అవకాశాలు ఉండటంతో క్రూడ్ ధరలను పెంచింది. ఆసియా కొనుగోలుదారులకు సౌదీ ఆరామ్‌కో అధిక ధరకు విక్రయిస్తోందని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం పేర్కొంది.

మే నెలలో చమురు ఉత్పత్తి కోటాను రోజుకు 2,06,000 బ్యారెళ్ల మేర పెంచడానికి చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్-ప్లస్ దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ఒపెక్ కీలక సభ్య దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే పరిస్థితుల్లో లేవు. ఒపెక్ సభ్యదేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్ నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల గల్ఫ్ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## యూపీఐ దూకుడు... 2025లో 33 శాతం పెరిగిన లావాదేవీలు!




**న్యూఢిల్లీ:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. 2025 సంవత్సరంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిగిన లావాదేవీలు 33 శాతం వృద్ధి చెంది 228.5 బిలియన్లకు చేరాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ.299.74 ట్రిలియన్లుగా నమోదైంది. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది.

నివేదిక ప్రకారం, వ్యాపారులకు జరిపిన చెల్లింపులు 34 శాతం పెరిగి 143.82 బిలియన్లకు చేరాయి. మరోవైపు, యూపీఐ సగటు లావాదేవీ విలువ (యావరేజ్ టికెట్ సైజ్) 9 శాతం తగ్గి రూ.1,314కు చేరింది. ముఖ్యంగా వ్యాపారుల వద్ద జరిపే చెల్లింపుల సగటు విలువ రూ.592కు పడిపోవడం గమనార్హం. గతంలో నగదుతో జరిపిన వీధి వ్యాపారుల వద్ద కొనుగోళ్ల వంటి చిన్న చిన్న చెల్లింపులు కూడా డిజిటల్ పరిధిలోకి వస్తున్నాయని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది.

డిజిటల్ చెల్లింపుల కోసం మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. 2025లో యూపీఐ క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 15 శాతం పెరిగి 731.38 మిలియన్లకు చేరింది. "భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పరిణితిలో కొత్త దశకు చేరుకుంటోంది," అని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు.

మరోవైపు, భారత్ బిల్‌పే ద్వారా జరిగే రికరింగ్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. దీని లావాదేవీల సంఖ్య 40 శాతం పెరిగి 3.05 బిలియన్లకు, వాటి విలువ 93 శాతం వృద్ధితో రూ.14.84 ట్రిలియన్లకు చేరింది. ఎడ్యుకేషన్ ఫీజులు, బీమా, ఈఎంఐల వంటివి దీని ద్వారా చెల్లించడం పెరుగుతోందని నివేదిక వివరించింది. ఇదే సమయంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు 27 శాతం పెరగ్గా, చిన్న లావాదేవీలు యూపీఐకి మళ్లడంతో డెబిట్ కార్డుల వాడకం 23 శాతం తగ్గింది.

# ఈడెన్ గార్డెన్స్‌లో వర్షం... నిలిచిన ఐపీఎల్ మ్యాచ్

కోల్‌కతా: కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. కేకేఆర్ ఇన్నింగ్స్ 3.4 ఓవర్ల వద్ద వర్షం మొదలవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ సమయానికి కోల్‌కతా 2 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసింది. క్రీజులో అజింక్యా రహానే (8), అంగ్‌క్రిష్ రఘువంశీ (7) ఉన్నారు. అంతకుముందు టాస్ గెలిచిన కేకేఆర్ కెప్టెన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, పంజాబ్ బౌలర్ జేవియర్ బార్ట్‌లెట్ ఆరంభంలోనే కేకేఆర్‌ను దెబ్బతీశాడు. ఓపెనర్ ఫిన్ అలెన్ (6), కామెరాన్ గ్రీన్ (4) వికెట్లు పడగొట్టి కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టాడు. బార్ట్‌లెట్ కేవలం 1.4 ఓవర్లలో 9 పరుగులిచ్చి 2 వికెట్లు తీయడం విశేషం. ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే వర్షం రావడంతో మైదానం సిబ్బంది వెంటనే పిచ్‌తో పాటు మైదానం మొత్తాన్ని కవర్లతో కప్పివేశారు. మధ్యలో కొద్దిసేపు వర్షం ఆగిపోవడంతో కవర్లు తీసినప్పటికీ, మళ్లీ చినుకులు మొదలవడంతో ఆటను కొనసాగించలేకపోయారు. ప్రస్తుతం తేలికపాటి వర్షం




కురుస్తుండటంతో మ్యాచ్ పునఃప్రారంభం ఆలస్యమవుతోంది. ఈడెన్ గార్డెన్స్‌లో మైదానం మొత్తాన్ని కప్పే సదుపాయం ఉన్నందున, వర్షం పూర్తిగా ఆగితే ఆట త్వరలోనే మొదలయ్యే అవకాశం ఉంది.



## భారత దిగ్గజాలకు ప్రత్యేక గౌరవం..



### చిన్నస్వామిలో ద్రవిడ్, కుంబ్లే పెవిలియన్ ఎండ్..!

**బెంగళూరు:** ఐపీఎల్ వేళ భారత దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లేకు ప్రత్యేక గౌరవం లభించింది. టీమిండియాకు, కర్నాటక క్రికెట్‌కు వీరిద్దరు అందించిన విశేష సేవలకు గుర్తుగా కర్నాటక క్రికెట్ సంఘం చిన్నస్వామి స్టేడియంలో స్టాండ్లు ఏర్పాటు చేసింది. ఆదివారం ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌కు ముందు ద్రవిడ్, కుంబ్లేలు రిమోట్‌తో తమ పేరిట ఏర్పాటు చేసిన పెవిలియన్‌ను ప్రారంభించి మురిసిపోయారు.

ఐపీఎల్ సందడితో పూర్వవైభవం సంతరించుకున్న చిన్నస్వామి స్టేడియంలో భారత మాజీ ఆటగాళ్ల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. కర్నాటక క్రికెట్‌పై.. ఆపై టీమిండియాపై చెరగని ముద్ర వేసిన రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే పేర్లతో స్టాండ్స్ ఏర్పాటు చేసింది రాష్ట్ర క్రికెట్ సంఘం.

ఆదివారం ఆర్సీబీ, సీఎస్కే మ్యాచ్‌కు ముందు కేసీఎస్ చీఫ్ వెంకటేశ్ ప్రసాద్ తనతోపాటు కుంబ్లే, ద్రవిడ్‌ను మైదానంలోకి తీసుకెళ్లాడు. వారికి రిమోట్ అందించి.. వారి పేర్లతో ఏర్పాటు చేసిన పెవిలియన్ ఎండ్‌ను ప్రారంభింపజేశారు. అనంతరం వీరికి జ్ఞాపికలు ప్రదానం చేశారు. చిన్నస్వామిలోని పెవిలియన్ ఎండ్స్‌కు ఇద్దరు దిగ్గజాల పేర్లు పెట్టడంపై మాజీ ఆటగాళ్లు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఆసియా ఛాంపియన్‌షిప్స్ నుంచి వైదొలిగిన సాత్విక్-చిరాగ్ జోడీ..



### ఆ ఇద్దరిపైనే ఆశలన్నీ..!

**న్యూఢిల్లీ:** భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి మరో మెగా టోర్నీ నుంచి వైదొలిగారు. ఇప్పటికే గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ ముందే నిష్క్రమించిన ఈ జోడీ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. సాత్విక్ భుజం గాయంతో బాధ పడుతున్నందున టోర్నీ నుంచి వైదొలగుతున్నట్టు కోచ్ టాన్ కిమ్ హెర్ వెల్లడించాడు.

ఆ ఏడాది సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టిలకు కలిసి రావడం లేదు. ఈ మధ్య కాలంలో వీరిద్దరు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నారు. గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో ఆడలేకపోయిన భారత జోడీ.. మరోసారి గాయం వల్లనే బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. 2023లో విజేతగా నిలిచిన సాత్విక్ -- చిరాగ్ జంట నిష్క్రమణతో లక్ష్య సేన్, పీవీ సింధులపైనే పతకం ఆశలు పెట్టుకుంది భారత్.

పురుషుల సింగిల్స్‌లో సేన్, మహిళల సింగిల్స్‌లో సింధులు సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. భుజం గాయం నుంచి కోలుకుంటున్న హెచ్‌హెస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లు బరిలో దిగుతున్నా ఇటీవలి ఫామ్ దృష్ట్యా పతకం ఖాయమని చెప్పలేం. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో దినేశ్ ఖన్నా 1965 పురుషుల సింగిల్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు.

# ఇలాంటివి ఒక్కరోజులో సాధ్యం కావు...

### ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించడంపై భువనేశ్వర్ కుమార్ స్పందన

**న్యూఢిల్లీ:** "మైలురాళ్లు అనేవి ఒక్కరోజులో సాధ్యమయ్యేవి కావు. ఏళ్ల తరబడి నిరంతరంగా పడిన శ్రమకు దక్కే ఫలితాలు ఇవి" అని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేసర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. ఐపీఎల్‌లో 200 వికెట్ల మైలురాయితో చరిత్ర సృష్టించిన సందర్భంగా అతడు తన అనుభవాలను పంచుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించడంపై భువనేశ్వర్ సంతోషం వ్యక్తం చేశాడు. "ఐపీఎల్ నా కెరీర్‌లో ఓ కీలక భాగం. 200 వికెట్లు పడగొట్టడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నా ఐపీఎల్ ప్రయాణం ఆర్సీబీతోనే మొదలైంది. మళ్లీ ఇక్కడికే తిరిగొచ్చి ఈ ఘనత సాధించడం ఒక ఫుల్ సర్కిల్ మూమెంట్‌లా అనిపిస్తోంది" అని భువీ తెలిపాడు.



బౌలర్లకు ఆట కఠినంగా మారుతోందని భువనేశ్వర్ అభిప్రాయపడ్డాడు. "కేవలం నైపుణ్యం మాత్రమే కాదు, పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ చేయడం, బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు కొత్త మార్గాలు అన్వేషించడం ముఖ్యం. ఇది బ్యాటర్ల గేమ్ అని అంటుంటారు, కానీ బౌలర్లు కూడా వారికి గట్టి సవాలు విసురుతున్నారని నేను భావిస్తున్నా" అని వివరించాడు.

చెన్నైతో మ్యాచ్ గురించి మాట్లాడుతూ, "ఓ బౌలింగ్ యూనిట్‌గా మేము సమావేశాల్లో చర్చించుకున్న ప్రణాళికలకే కట్టుబడి ఉన్నాం. ప్రత్యర్థులకు అనుగుణంగా సిద్ధమవుతున్న తీరు మాకు మంచి ఫలితాలను ఇస్తోంది" అని భువీ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ 41 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి, ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మొత్తం 192 ఇన్నింగ్స్‌లలో 202 వికెట్లతో, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.

MOVIE TIME

## గాయపడ్డ సింహం.. ఓ మంచి పాత్రలో కనిపిస్తా

నటుడు జెడి చక్రవర్తి



**టాకీస్:** కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు.

## చెన్నైలో సింగిల్‌గా.. నటి సుభాషిణి ఆత్మహత్య..!



**టాకీస్:** సినీ నటి సుభాషిణి (36)ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై పోరూరులోని అపార్ట్‌మెంట్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుభాషిణి స్వస్థలం శ్రీలంక కాగా.. బెంగళూరుకు చెందిన పిప్పిన్‌తో వివాహం జరిగింది. భర్త పిప్పిన్‌తో కలిసి బెంగళూరులో నివసించే సుభాషిణి షూటింగ్స్ కోసం చెన్నై పోరూరులో సింగిల్‌గా ఉంటోంది. సుభాషిణి టీవీ సీరియల్ 'కయల్'తోపాటు పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. భర్తతో వీడియో కాల్‌లో వాగ్వాదం తర్వాత సుభాషిణి ఆత్మహత్య చేసుకుంది. కయల్ సీరియల్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న సుభాషిణి.. సోషల్ మీడియాలో కూడా చురుకుగా ఉంటుంది. మంగళవారం రాత్రి భర్తతో వీడియో కాల్‌లో వాగ్వాదం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుభాషిణి ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?

**టాకీస్:** మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.



## లవ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఓటీటీ పోటీ

**టాకీస్:** లవ్‌టుడే, డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నాడు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. థియాట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ మూవీకి డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఓటీటీ డీల్ కుదిరినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. నాలుగు వారాల థియాట్రికల్ రన్ తర్వాత మిడ్ మేలో ఈ మూవీ ఓటీటీ డెబ్యూ ఇవ్వనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌లో ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై



ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని టీజర్‌లో హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.

## రాకాసకు మంచి ఓపెనింగ్స్

**టాకీస్:** మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్టాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్టాటజ్రీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.